సాక్షి
నిజామాబాద్

శుక్రవారం । 1 । ఆగస్టు । 2025



సామర్థ్యం ఎక్కువ..
ఎస్సారెస్పీ దిగువన ఉన్న జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంపై ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.
- 8లో ▸



గిరిజనుల సంస్కృతికి ప్రతీక తీజ్
గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ ప్రతీకగా నిలుస్తోంది. శ్రావణ మాసంలో తొమ్మిది రోజులు ఉత్సవాలు జరుగుతాయి.
- 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
28.5 /23.1
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

డాక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్, అదనపు డీఎంఈ డాక్టర్ ఎస్ కృష్ణమోహన్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 11 వరకు కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 14న ఉదయం 11గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ పద్ధతిలో ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రొఫెసర్ (3), అసోసియేట్ ప్రొఫెసర్(5), అసిస్టెంట్ ప్రొఫెసర్(31), ట్యూటర్(5), సీనియర్ రెసిడెంట్(24) పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కళాశాల వెబ్‌సైట్ www. gmcnzb.orgను సందర్శించాలని సూచించారు.

హెచ్‌పీఎస్‌లో ప్రవేశాలకు..

నిజామాబాద్‌అర్బన్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతి (ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని గిరిజన అభివృద్ధి శాఖ అధికారి నాగోరావు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారాలు కలెక్టరేట్‌లోని గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయం లభిస్తాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసే బాల బాలికలు 1 జూన్ 2018 నుంచి 31 మే 2019 లోపు జన్మించి ఉండాలని తెలిపారు. తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1,50,000, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు ఉండాలన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేసి ఈ నెల 8వ తేదీ లోపు గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

రైతులు ఆందోళన చెందవద్దు



ధర్పల్లి: జిల్లాలో యూరియా కొరత లేదని రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయ అధికారి మేకల గోవింద్ అన్నారు. ధర్పల్లితోపాటు రామడుగు , హొన్నాజీపేట్ సొసైటీ గోదాములు, ప్రైవేట్ డీలర్స్ షాపులలో ఎరువులను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఏవో మాట్లాడుతూ.. ప్రతిరోజు జిల్లాకు సరిపడా యూరియా వస్తుందన్నారు. రైతులు నానో యూరియా వాడాలన్నారు. దీంతో భూమి ఆరోగ్యంగా ఉండటంతోపాటు పంట దిగుబడులు పెరుగుతాయని సూచించారు. ధర్పల్లి మండలంలో 282 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు అవసరానికి మించి యూరియాను కొనుగోలు చేసి కృత్రిమ కొరత సృష్టించవద్దని కోరారు. ఏవో వెంకటేశ్, ఏఈవో లావణ్య ఉన్నారు.



తెయూకు

ఇంజినీరింగ్ కళాశాల

పదేళ్ల కల సాకారం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. ప్రజలు, విద్యార్థులు, విద్యావంతుల నిరంతర పోరాటాలు, ప్రజా ప్రతినిధులు, నేతల కృషి ఫలించింది. తెలంగాణ యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేస్తూ గురువారం ప్రభుత్వం జీవో జారీ చేసింది.

జీవో జారీ చేసిన ప్రభుత్వం

- నాలుగు కోర్సులకు అనుమతి
- మూడో విడత కౌన్సెలింగ్ ద్వారా ఇంజినీరింగ్ సీట్ల భర్తీ
- సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు
- వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): పదేళ్ల ఎదురు చూపులకు తెరదించుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయడం ఆనందంగా ఉందని వీసీ ప్రొఫెసర్ టీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం తెయూ పరిపాలనా భవనంలో వారు మీడియాతో మాట్లాడారు. గతంలో తాను వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినప్పుడు తెలంగాణ వర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల ఇస్తానని స్వయంగా చెప్పారని, ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా జీవో నెంబర్ 32ను గురువారం జారీ చేసినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం కళాశాల మంజూరు చేసిన సీఎంకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

మూడో విడత కౌన్సెలింగ్ ద్వారా సీట్ల భర్తీ

ప్రస్తుతం ఇంజినీరింగ్ ప్రవేశాల ప్రక్రియ రెండో విడత కౌన్సెలింగ్ కొనసాగుతున్నందున మూడో విడత కౌన్సెలింగ్‌లో తెయూ ఇంజనీరింగ్ కళాశాల పేరు చేర్చి సీట్ల భర్తీ చేపడతారని వీసీ యాదగిరిరావు పేర్కొన్నారు.

అందుబాటులో ఫ్యాకల్టీ, కాలేజ్ భవనం

తెయూలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు ఇటీవలే రూ.18 కోట్ల వ్యయంతో నిర్మించిన సైన్స్ కాలేజీ భవనం సిద్ధంగా ఉందని వీసీ తెలిపారు. అన్ని రకాల మౌలిక వసతులు, కంప్యూటర్ సైన్స్ కోర్సులు బోధించేందుకు రెగ్యులర్ ఫ్యాకల్టీ, ముగ్గురు ప్రొఫెసర్లు, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు కాంట్రాక్టు అధ్యాపకులు అందుబాటులో ఉన్నారన్నారు. అవసరమైతే గెస్ట్ ఫ్యాకల్టీని నియమిస్తామన్నారు. బడ్జెట్ కేటాయింపు, పోస్టుల మంజూరు ఉత్తర్వుల జారీకి తమవంతు ప్రయత్నం చేస్తున్నట్లు వీసీ, రిజిస్ట్రార్‌లు తెలిపారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వీసీ యాదగిరి రావు, రిజిస్ట్రార్ యాదగిరి

సీఎం చేతుల మీదుగా ప్రారంభం

ఆగస్టు 15లోపు జిల్లా పర్యటనకు రానున్న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇంజినీరింగ్ కళాశాలను ప్రారంభింపజేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వీసీ యాదగిరిరావు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరంలో అదనంగా మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ కోర్సులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని వీసీ తెలిపారు. ఈసారి బడ్జెట్‌లో తెయూ అభివృద్ధికి ప్రభుత్వం రూ.35 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు. బడ్జెట్ కేటాయింపు, పోస్టుల భర్తీకి ప్రయత్నిస్తామన్నారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు..

ఇంజినీరింగ్ కళాశాల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రూరల్, బోధన్ ఎమ్మెల్యేలు డాక్టర్ భూపతిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, విద్యార్థి సంఘాల నాయకులకు వీసీ కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ఏర్పాటు ఆవశ్యకతపై ప్ర త్యేక కథనాలు ప్రచురించి ప్రభుత్వం దృష్టికి వెళ్లేలా చేసి మార్గం సుగమం చేసిన పాత్రికేయులకు వీసీ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ వర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల మంజూరులో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి పాత్ర ఎంతో ఉందని వీసీ పేర్కొన్నారు.

మంజూరైన కోర్సులు..

ప్రస్తుత విద్యా సంవత్సరం (2025–26)లో బీటెక్ కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఐటీ, డాటా సైన్స్ కోర్సులు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కో కోర్సులో 60 సీట్లతో పాటు ఈడబ్ల్యూఎస్ కోటా కింద 6 సీట్లు మొత్తం 264 సీట్లు భర్తీ చేస్తారని వీసీ చెప్పారు.

'సాక్షి' చర్చాగోష్టి.. ప్రత్యేక కథనాలు

కృతజ్ఞతలు తెలిపిన విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల నాయకులు

తెయూ(డిచ్‌పల్లి) : తెయూలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు 'సాక్షి' తనవంతు కృషి చేసింది. పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి నిజామాబాద్ జిల్లాను సందర్శించిన సమయంలో తెయూకు ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని గుర్తుచేస్తూ ప్రత్యేక కథనాలను ప్రచురించింది. 12 ఏప్రిల్ 2025న 'సాక్షి' టౌన్ ఆఫీస్‌లో వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 'తెలంగాణ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలి' అనే అంశంపై చర్చాగోష్టి నిర్వహించింది. ప్రభుత్వం కళాశాల మంజూరు చేస్తే చాలు తాము నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని జూన్ 24న వర్సిటీని సందర్శించిన ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి దృష్టికి వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి తీసుకెళ్లారు. జూలై 8న 'మంజూరు చేస్తే చాలు' అనే కథనాన్ని 'సాక్షి' ప్రచురించింది. 577 విశాలమైన క్యాంపస్‌తోపాటు సైన్స్ కాలేజ్ భవనం, మౌలిక వసతులు, ఫ్యాకల్టీ అందుబాటులో ఉన్నాయంటూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ఇలా తెయూలో ఇంజినీరింగ్ కళాశాల మంజూరు విషయంలో కృషి చేసిన 'సాక్షి' దినపత్రికకు పలువురు విద్యార్థి సంఘాల నాయకులు, విద్యావేత్తలు గురువారం ఫోన్లు చేసి కృతజ్ఞతలు తెలిపారు.



కలిసికట్టుగా పోరాటం



మంజూరు చేస్తే చాలు..

జిల్లా నేతల కృషి





సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ వర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు వెనుక పలువురి కృషి ఉంది. పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు డాక్టర్ భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ సైతం కళాశాల కోసం పాటుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించిన రోజున నిజామాబాద్ జిల్లాకు కచ్చితంగా ఇంజినీరింగ్ కళాశాలను సాధిస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగానే ఆయన శక్తివంచన లేకుండా కృషి చేశారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని జిల్లాకు ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేశారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సైతం జిల్లా విద్యార్థులకు సాంకేతిక విద్యను మరింత చేరువ చేసేందుకు గట్టి ప్రయత్నాలు చేసి సాధించారు. ఈ కళాశాలతో నిజామాబాద్ జిల్లాతోపాటు ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి జిల్లాల విద్యార్థులకు మరింత మేలు కలుగనుంది. టీయూలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే ఉత్తర తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన పేద, మధ్యతరగతి విద్యార్థులకు సాంకేతిక విద్య అభ్యసించేందుకు చాలా ఉపయుక్తంగా ఉంటుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా శాసనసభలో పలుమార్లు ప్రస్తావించారు.

సీఎంకు ధన్యవాదాలు

- ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



తెలంగాణ వర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయ డంపై నిజామాబా ద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న విద్యార్థులు, విద్యాభిమానుల ఆకాంక్షలు నెరవేరడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కళాశాల ఏర్పాటు చేయించడం హర్షణీయమన్నారు.

సౌత్ క్యాంపస్‌లో సంబురాలు



ప్రిన్సిపాల్‌కు స్వీట్లు తినిపిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

భిక్కనూరు: తెలంగాణ వర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల మంజూరు కావడాన్ని హర్షిస్తూ డాక్టరేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు గురువారం సౌత్ క్యాంపస్‌లో సంబురాలు జరుపుకున్నారు. ఎన్నో ఏళ్ల కల నేరవేరిందని డాక్టరేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్‌గౌడ్ అన్నారు. ప్రభుత్వం ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

విద్యార్థులు బాణాసంచా కాల్చి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, డాక్టరేట్ అసోసియేషన్ ప్రతినిధులు రాహుల్ నేత, సరిత, సత్యం, రమేశ్, అధ్యాపకులు అంజయ్య, మోహన్‌బాబు, యాలాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఇందూరులో కలెక్టర్ సుడిగాలి పర్యటన

- మున్సిపల్ కమిషనర్‌తో కలిసి అభివృద్ధి పనుల పరిశీలన
- అలసత్వం వహిస్తున్న అధికారులు, గుత్తేదారులపై మండిపాటు
- నాణ్యతతో పనులు వేగవంతం చేయాలని ఆదేశం



అహ్మదీబజార్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, కమిషనర్

నిజామాబాద్ సిటీ: నగరంలో కలెక్టర్ టీ వినయ్‌కృష్ణారెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల వివరాలు, జాప్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు.

సమీకృత మార్కెట్‌లో..

ఖలీల్‌వాడిలో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు నిలిచిపోవడంపై కమిషనర్‌ను వివరణ అడిగి తెలుసుకున్నారు. గడువులోపు పనులన్నీ పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సూచించారు. అహ్మదీబజార్‌లో నిర్మాణం పూర్తయినా వాడుకలోకి తీసుకురాకపోవడంపై ఆరా తీశారు. పాత గంజ్‌ను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ట్రాఫిక్ ఆంక్షలు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో ఇబ్బందులు వస్తున్నాయని మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆక్రమణలను తొలగించాలని కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం నాగారంలో నిర్మించిన రాజీవ్‌గృహకల్ప ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులకు వాటిని కేటాయించేలా అవసరమైన మరమ్మతులు చేయించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

డంపింగ్ యార్డు సందర్శన..

నాగారం శివారులోని డంపింగ్ యార్డును కలెక్టర్ సందర్శించారు. బల్దియా చేపడుతున్న చెత్త సేకరణ, చెత్తనిల్వను పరిశీలించారు. చుట్టుపక్కల వారికి దుర్వాసన రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బయో మైనింగ్ ప్రక్రియను చూశారు. పెద్ద మొత్తంలో కంపోస్ట్ తయారీ కోసం అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. జిల్లాలోని ఆస్పత్రులకు సంబంధించిన వ్యర్థాలను రోజువారీగా సేకరిస్తూ నిర్దేశిత ప్రాంతంలో డిస్పోజ్ చేసేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు.

బస్తీ దవాఖాన, పాఠశాల తనిఖీ

ఖానాపూర్‌లోని బస్తీ దవాఖానను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తనిఖీ చేశారు. దవాఖానకు వచ్చిన రోగులతో మాట్లాడారు. పీహెచ్‌సీ తరహాలో అన్నిరకాల సేవలందిస్తూ, మందులు సిద్ధం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్‌కు సూచించారు. అనంతరం కాలూర్ ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో రవిబాబు, మున్సిపల్ ఈఈ మురళీమోహన్ రెడ్డి, డంపింగ్‌యార్డు ఇన్‌చార్జి ప్రభుదాస్, రషీద్, డీఈ ముస్తాక్ అహ్మద్, ఏఈ ఇనాయత్ కరీం, శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్ అలీ తదితరులు ఉన్నారు.

'అమృత్ 2.0' సకాలంలో పూర్తిచేయాలి

నగరంలో రూ.327 కోట్లతో చేపడుతున్న అమృత్ 2.0 పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఖానాపూర్, కాలూరులో నిర్మిస్తున్న పెద్ద వాటర్ (ఈఎల్ఎస్ఆర్)ట్యాంక్‌ల నిర్మాణ పనులు ప్రారంభ దశలో ఉండటంపై మండిపడ్డారు. నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. దుబ్బ ప్రాంతంలో యూజీడీ పైప్‌లైన్ విస్తరణ పనులు మందకొడిగా సాగడంపై కలెక్టర్ గుత్తేదార్లను నిలదీశారు.



దుబ్బలో యూజీడీ పనులపై గుత్తేదారుతో మాట్లాడుతున్న కలెక్టర్

పదోన్నతులకు కసరత్తు

- జిల్లాలో 140 మంది ఉపాధ్యాయులకు అవకాశం
- మొదలైన ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్‌అర్బన్ : జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ మొదలైంది. ఇటీవల ప్రభుత్వం టీచర్లకు పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా జిల్లాలోని అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించేందుకు జిల్లా విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. గురువారం ముందస్తుగా ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభించింది.

140 మందికి అవకాశం

జిల్లా విద్యాశాఖలో ప్రస్తుతం 140 ఖాళీలు ఉండగా, వాటిని పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, పండిట్‌లకు సంబంధించి ఖాళీలను పరిగణనలోకి తీసుకొని ప్రక్రియ చేపట్టనున్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. గతంలోని రోస్టర్ ప్రక్రియను పరిగణనలోకి తీసుకొని ఉపాధ్యాయులను ధ్రువపత్రాల పరిశీలనకు ఆహ్వానించారు. ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున ధ్రువపత్రాల పరిశీలన చేపడుతున్నారు. ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందే వారికి కేవలం డీఎడ్ అర్హతను పరిగణనలోకి తీసుకొన్నారు. స్కూల్ అసిస్టెంట్ నుంచి గెజిటెడ్ హెచ్ఎంగా పదోన్నతులను ఇవ్వనున్నారు. కాగా, మొదటిసారిగా విద్యాశాఖ పదోన్నతుల ప్రక్రియలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయనున్నారు.

వారి సంగతేంటి..?

పదోన్నతుల ప్రక్రియకు సంబంధించి 1998 డీఎస్సీకి సంబంధించిన కొందరు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు కొన్నేళ్లుగా పదోన్నతులు స్వీకరించడం లేదు. పదోన్నతులు తిరస్కరించిన వారు సర్వీస్ బుక్‌లో ఆ విషయాన్ని నమోదు చేసుకోవాల్సి ఉండగా, అలాంటిదేమీ జరగకపోవడంతో ప్రతిసారి వీరి పేర్లు నమోదవుతున్నాయి. ప్రస్తుతం కూడా లిస్టులో సుమారు 15 పేర్లు ఉన్నాయి. వీరికి మళ్లీ పదోన్నతులు కల్పిస్తారా లేదంటే తొలగిస్తారా అనేది విద్యాశాఖ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలి

పదోన్నతులకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలనకు శుక్రవారం విద్యాశాఖ కార్యాలయంలో టీచర్లు హాజరుకావాలని డీఈవో అశోక్ తెలిపారు. గ్రేడ్–2 తెలుగు, హిందీ, ఉర్దూ, పీఈటీ ఉపాధ్యాయులు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జిరాక్స్ సెట్, చెక్ లిస్టులతో రావాలని తెలిపారు. డీఎస్సీ 2017 వరకు ఎస్జీటీ నుంచి స్పెషల్ ఎడ్యుకేషన్‌కు అర్హులైన ఉపాధ్యాయులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలన్నారు.



ధ్రువపత్రాల పరిశీలన కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి వచ్చిన టీచర్లు

షెడ్యూల్ విడుదల

జిల్లా విద్యాశాఖలో పదోన్నతులకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేశారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఈ నెల 2న ఖాళీల ప్రదర్శన చేపడతారు. 3న అభ్యంతరాల స్వీకరణ, 4, 5 తేదీల్లో సీనియారిటీ జాబితా పరిశీలన అనంతరం తుది జాబితాను విడుదల చేస్తారు. 6న వెబ్ ఆప్షన్, ఎడిటింగ్ అవకాశం ఉంటుంది. 7న పదోన్నతులకు సంబంధించి ఆర్డర్లను జారీ చేస్తారు. 8, 9 తేదీల్లో ఎస్జీటీల పదోన్నతులకు సంబంధించి ఖాళీల ప్రదర్శన చేపడుతారు. 10న వెబ్ ఆప్షన్లు, ఎడిటింగ్ అవకాశం ఉంటుంది. 11న పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేస్తారు.

పారదర్శకంగా చేపట్టాలి



పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలి. లోటుపాట్లు లేకుండా విద్యాశాఖ పకడ్బందీగా వ్యవహరించాలి. ఉపాధ్యాయులకు ఎలాంటి సందేహాలు లేకుండా వివరాలను అందించాలి. అందరికీ న్యాయం జరిగేలా చూడాలి. లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

– ఓ రమేశ్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు.

ఎస్సీ టీచర్లకు న్యాయం



ఉపాధ్యాయ పదోన్నతులలో వర్గీకరణను అమలు చేయాలి. మొదటిసారిగా విద్యాశాఖ పదోన్నతుల ప్రక్రియలో వర్గీకరణను అమలు చేసే అవకాశం లభించింది. దీంతో ఎస్సీ టీచర్లకు న్యాయం జరుగుతుంది.

– ఎస్. సురేశ్, మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

క్లుప్తంగా

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు


మానాల మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: తెలంగాణ యూనివర్సిటీలో ఇంజినీరింగ్‌ కళాశాల మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడు, రాష్ట్ర కోఆపరేటివ్‌ యూనియన్‌ లిమిటెడ్‌ చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వరుసగా నెరవేర్చుతున్నామన్నారు. బీఆర్‌ఎస్‌ హయాంలో ఏవిధమైన కొత్త ప్రాజెక్టులు జిల్లాకు రాలేదన్నారు. తెలంగాణ వర్సిటీ సైతం దివంగత మహానేత రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఇచ్చిందేనన్నారు. ఇంజినీరింగ్‌ కళాశాలతో జిల్లా విద్యార్థులకు ఎనలేని మేలు కలుగుతుందన్నారు.

ఎండిన సోయాబీన్‌ పంటల పరిశీలన



కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్‌లో గడ్డి మందు పిచికారీ చేయడంతో ఎండిన సోయాబీన్‌ పంటలను గురువారం జగిత్యాల జిల్లా పొలాస ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. స్వాతి, స్పందన భట్‌, దినేష్‌, సంధ్యకిషోర్‌ల బృందం రైతుల నుంచి వివరాలు సేకరించింది. నివేదికను జిల్లా వ్యవసాయాధికారి మేకల గోవింద్‌కు అందజేస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. వారి వెంట ఏవో రమ్యశ్రీ ఉన్నారు.

3న సీనియర్‌ జిల్లాస్థాయి చెస్‌ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్‌ జిల్లా చెస్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఈ నెల 3న నగరంలోని అభ్యాస స్కూల్‌లో సీనియర్‌ మెన్‌, ఉమెన్‌ విభాగంలో చెస్‌ ఎంపిక పోటీలు ఉంటాయని సంఘం జిల్లా కార్యదర్శి రమేష్‌ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తప్పనిసరిగా చెస్‌బోర్డు, ఆధార్‌కార్డు తీసుకొని రావాలన్నారు. వివరాలకు 94400 07004ను సంప్రదించాలన్నారు.

పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే పాదయాత్ర



ఆర్మూర్‌: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేయడంలో భాగంగా ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌ కుమార్‌గౌడ్‌ పాదయాత్రకు శ్రీకారం చుట్టారని తెలంగాణ కోఆపరేటివ్‌ యూనియన్‌ లిమిటెడ్‌ చైర్మన్‌ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌ రెడ్డి అన్నారు. ఆర్మూర్‌లోని పీవీఆర్‌ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 2న ఆలూర్‌, గగ్గుపల్లి మీదుగా పాత బస్టాండ్‌ వరకు 10 కిలోమీటర్ల పాదయాత్ర ఉంటుందన్నారు. 3న ఉదయం పాత బస్టాండ్‌లో శ్రమదానం నిర్వహిస్తారన్నారు. అనంతరం ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాకు చెందిన ముఖ్య నాయకులతో సమావేశమవుతారన్నారు. కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఆర్మూర్‌ ఏఎంసీ చైర్మన్‌ సాయిబాబా గౌడ్‌, నాయకులు పండిత్‌ పవన్‌, అయ్యప్ప శ్రీనివాస్‌, షేక్‌ మున్ను, బైండ్ల ప్రశాంత్‌, భూమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యం ఎక్కువ.. ఉత్పత్తి తక్కువ

- చేపపిల్లల ఉత్పత్తిలో నిర్లక్ష్యం!
- ఎస్సారెస్పీలో ఈ ఏడాది 54 లక్షల చేప పిల్లల లక్ష్యం
- పని చేయని జార్‌ హెచరీలు
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు


నిరుపయోగంగా ఉన్న జార్‌ హెచరీలు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ దిగువన ఉన్న జాతీయ కేంద్రంలో చేపపిల్లల ఉత్పత్తిపై ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. 5 కోట్ల చేప పిల్లలను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్న కేంద్రంలో ప్రస్తుత సంవత్సరం కేవలం 54 లక్షల చేప పిల్లలను ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు. 54 లక్షల చేపపిల్లల ఉత్పత్తికి 2.4 కోట్ల స్పాన్‌ అవసరం ఉండగా, ఇప్పటి వరకు 1.75 కోట్ల స్పాన్‌ను ఉత్పత్తి చేశారు. మరో 65 లక్షల స్పాన్‌ ఉత్పత్తి చేస్తే లక్ష్యం పూర్తవుతుందని అధికారులు చెప్తున్నారు. సామర్థ్యం కన్నా తక్కువ చేపపిల్లల ఉత్పత్తిపై అధికారులు నోరు మెదపడం లేదు.

తల్లి చేపల సేకరణ నుంచి..

జాతీయ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రంలో తల్లి చేపలను ఉంచి వాటి నుంచి గుడ్లును సేకరించి హెచరీలో బాయిల్డ్‌ చేసి స్పాన్‌ను ఉత్పత్తి చేస్తారు. ఉత్పత్తి చేసిన స్పాన్‌ను నర్సరీల్లో వేసి చేప పిల్లలను అంగుళం సైజ్‌ వరకు పెంచుతారు. 5కోట్ల చేపపిల్లలు ఉత్పత్తి కావాలంటే కనీసం 15కోట్ల స్పాన్‌ను ఉత్పత్తి చేయాలి. అందుకు కనీసం రెండున్నర టన్నుల తల్లి చేపలు అవసరం ఉంటుంది. కానీ, ఈ సంవత్సరం 700 కేజీల తల్లి చేపలను మాత్రమే సేకరించారు. దీంతో మరోసారి స్పాన్‌ ఉత్పత్తి చేపడితే తల్లి చేపలు ఖాళీ అవుతాయి. అందుకే 2.4 కోట్ల స్పాన్‌ ఉత్పత్తి చేసి చేతులు దులుపుకోవడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని మత్స్య సహకార సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

నిరుపయోగంగా హెచరీలు..

చేపపిల్లల కేంద్రంలో జార్‌ హెచరీలు కొంతకాలంగా పని చేయడం లేదు. దీంతో తాత్కాలికంగా నిర్మించిన ఎకో హెచరీల్లోనే స్పాన్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. చైనీస్‌ హెచరీలను నిర్మించినా వాటిని వినియోగించడం లేదు. ఫలితంగా స్పాన్‌ ఉత్పత్తి కూడా తక్కువే అవుతుంది. సరైన పద్ధతిలో చేపపిల్లల ఉత్పత్తి చేపడితే జిల్లాలోని చెరువులు, ప్రాజెక్టులకు ఈ కేంద్రం నుంచే చేపపిల్లలను సరఫరా చేపట్టవచ్చు. కానీ, టెండర్ల ద్వారా వచ్చిన చేపపిల్లలను చెరువుల్లో వదులుతారు. కమీషన్లపై ఉన్న శ్రద్ధ చేప పిల్లల ఉత్పత్తిపై లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. చేపపిల్లల ఉత్పత్తికి మరో 20 రోజుల సమయం ఉంది. తల్లి చేపలుంటే మరింత స్పాన్‌ను ఉత్పత్తి చేసే అవకాశం ఉండేది. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో చేపపిల్లల ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు వేడుకుంటున్నారు.


చేపపిల్లలకు వినియోగిస్తున్న ఎకో హెచరీలు

లక్ష్యానికి అనుగుణంగా ఉత్పత్తి

ప్రస్తుత సంవత్సరం 54లక్షల చేపపిల్లల ఉత్పత్తి లక్ష్యంగా విధించారు. అందుకు అనుగుణంగానే చేపపిల్లల ఉత్పత్తి చేపడుతున్నాం. 700 కేజీల తల్లి చేపలను మాత్రమే సేకరించాం. మత్స్యకారులకు డబ్బులు చెల్లించకపోవడంతో తల్లి చేపలను ఇవ్వడం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– దామోదర్‌, ఎఫ్‌డీవో, పోచంపాడ్‌

గిరిజనుల సంస్కృతికి ప్రతీక తీజ్‌

- ప్రతియేటా ఆషాఢ, శ్రావణమాసాల్లో ఉత్సవాల నిర్వహణ
- గోధుమ బుట్టలకు తొమ్మిదిరోజుల పాటు నిష్ఠతో పూజలు చేయనున్న యువతులు


గోధుమ బుట్టలతో యువతులు

నిజామాబాద్‌ రూరల్‌: గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలకు తీజ్‌ పండుగ ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి ఏడాది శ్రావణమాసంలో తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను గిరిజనులు జరుపుకుంటారు. తండాలు పాడి పంటలతో కళకళలాడాలని, ప్రజలను రోగాల బారి నుంచి రక్షించాలని జగదాంబ, సేవాలాల్‌, రామ్‌రావు మహరాజ్‌తో పాటు వనదేవతలను వేడుకుంటారు. తీజ్‌ పండుగలో భాగంగా వివిధ తండాల్లో ఉన్న జగదాంబ, సేవాలాల్‌ మహరాజ్‌ ఆలయాల్లో గోధుమ బుట్టలకు తొమ్మిది రోజులపాటు యువతులు తమకు మంచి భర్త రావాలని పూజలు చేస్తారు.

ఉత్సవాల కోసం విరాళాలు

తీజ్‌ పండుగ నిర్వహణకు కావలసిన గోధుమలు, చిన్న వెదురు బుట్టల కొనుగోలు కోసం తండా పెద్దలు ప్రతి ఇంటి నుంచి విరాళాలు సేకరిస్తారు. యువతులు పుట్టమన్ను తెచ్చి, అందులో గోధుమలు కలిపి వెదురు బుట్టలో వేసి, ఒక మంచెపై ఉంచుతారు. నాటి నుంచి యువతులు తొమ్మిది రోజులు ఉపవాస దీక్ష చేపడతారు. రోజూ ఉదయం, సాయంత్రం బుట్టలో నీరు పోస్తారు. సాయంత్రం వేళ యువతులు బుట్టలు ఉన్న మంచె వద్ద గుంపులుగా చేరి ఉత్సవ గీతాలు ఆలపిస్తారు. బంజారా సంప్రదాయ నృత్యం చేస్తారు. తొమ్మిది రోజుల్లో బోరడి ఝుష్కెరో, ఢమోళి, గణ్‌ గోర్‌ వంటి కార్యక్రమాలు ఉంటాయి. తొమ్మిదో రోజు అసలైన తీజ్‌ ఉత్సవం జరుగుతుంది. వివిధ ప్రాంతాల్లో ఉండే తమ బంధువులను ఆహ్వానిస్తారు. తండా ప్రజలు తీజ్‌ బుట్టల నిమజ్జనానికి శోభాయాత్రగా వెళతారు. ఓ ప్రదేశంలో బుట్టలు కిందకి దించి వలయాకారంలో కూర్చుంటారు. ఈ సమయంలో బంధువులు, సోదరులు ఆ బుట్టల్లో తోచినంత డబ్బు కట్నంగా వేస్తారు. యువతులు తీజ్‌ నారు తెంపి పెద్దలు పెట్టుకున్న తలపాగాల్లో అమరుస్తారు. యువతుల పాదాలు సోదరులు నీటితో కడిగి ఆశీర్వాదం తీసుకుంటారు. యువతులు బుట్టలను తలపై పెట్టుకుని పాటలు పాడుతూ సమీపంలో చెరువు వద్దకు వెళతారు. మొదట సేవాలాల్‌ మహరాజ్‌, దండియాడికి చెందిన తీజ్‌ బుట్టను నిమజ్జనం చేసిన అనంతరం ఒక్కొక్కరు తమ తమ బుట్టలను గీతాలాపనల మధ్య నిమజ్జనం చేస్తారు.

రాష్ట్ర పండుగగా గుర్తించాలి..

తీజ్‌ పండుగను కాంగ్రెస్‌ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించాలి. నిధులను విడుదల చేయాలి. పండుగలో పంటలు బాగా పండాలని తీజ్‌ పండుగ నిర్వహిస్తాం. ఎంతో నిష్ఠతో బంజారాలు నిర్వహించుకోవడం సంప్రదాయంగా వస్తుంది.

–ప్రేమ్‌లాల్‌, బంజారా కవి, నిజామాబాద్‌

తెయూలో మిన్నంటిన సంబురాలు


మహేష్‌కుమార్‌ గౌడ్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తెయూ ఎన్‌ఎస్‌యూఐ నాయకులు


సంబురాలు జరుపుకుంటున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీకి ఇంజినీరింగ్‌ కళాశాల మంజూరు చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో దశాబ్దాల కల నెరవేరిందని విద్యార్థి సంఘాల నాయకులు, అధ్యాపకులు, విద్యార్థులు సంబురాలు జరుపుకున్నారు. తెయూ ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో టీపీసీసీ చీఫ్‌, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌ గౌడ్‌, సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు పుప్పాల రవి, సాగర్‌ నాయక్‌, ప్రిన్సిపాల్‌ ప్రవీణ్‌, ప్రొఫెసర్లు కనకయ్య, బాలకిషన్‌, పున్నయ్య, మహేందర్‌ పాల్గొన్నారు. పీడీఎస్‌యూ కొన్నేళ్లుగా చేపట్టిన ఆందోళన కార్యక్రమాలతోనే ప్రభుత్వం ఇంజినీరింగ్‌ కళాశాల మంజూరు చేసిందని జిల్లా కార్యదర్శి రాజేశ్వర్‌, సహాయ కార్యదర్శి ప్రిన్స్‌ ఒక ప్రకటనలో తెలిపారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

తెలంగాణ యూనివర్సిటీ ఏబీవీపీ ఆధ్వర్యంలో ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని హర్షం వ్యక్తం చేశారు. ఏబీవీపీ పోరాటాలతోనే ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. నాయకులు శివ, సమీర్‌, సాయి, అక్షయ్‌, అజయ్‌, అశోక్‌, లెనిన్‌, అఖిల్‌, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యూత్‌ కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో..

నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ జిల్లాకు ఇంజినీరింగ్‌ కళాశాల మంజూరుచేయడంపై జిల్లా యూత్‌ కాంగ్రెస్‌ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో గురువారం జిల్లా యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు విపుల్‌గౌడ్‌ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్‌ బొమ్మ మహేష్‌ కుమార్‌ గౌడ్‌ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. విపుల్‌గౌడ్‌ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌ రెడ్డి, పీసీసీ చీఫ్‌ బొమ్మ మహేష్‌కుమార్‌ గౌడ్‌, బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్‌ అలీ షబ్బీర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు ఆకుల మహేందర్‌, పంచరెడ్డి చరణ్‌, లవంగ ప్రమోద్‌, నరేందర్‌ సింగ్‌ తదితరులున్నారు.


యూత్‌ కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో..

బడుగు, బలహీనవర్గాలకు కాంగ్రెస్‌ రక్షణ

- రాష్ట్ర మినరల్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ ఈరవత్రి అనిల్‌
- ముగిసిన ఆదివాసీ గిరిజన కాంగ్రెస్‌ ఉమ్మడి జిల్లా శిక్షణా శిబిరం


సమావేశంలో మాట్లాడుతున్న ఈరవత్రి అనిల్‌

నిజామాబాద్‌ సిటీ: బడుగు, బలహీనవర్గాలు, గిరిజనులు, ఆదివాసీల హక్కుల కోసం కాంగ్రెస్‌ పాటుపడుతుందని, వారికి రక్షణగా పార్టీ ఉంటుందని రాష్ట్ర మినరల్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ ఈరవత్రి అనిల్‌ అన్నారు. కాంగ్రెస్‌ హయాంలోనే పేదల సంక్షేమం జరిగిందని, పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలదేనన్నారు. జిల్లాకేంద్రంలోని హోటల్‌ హరితలో మూడు రోజులుగా కొనసాగుతున్న ఆదివాసీ గిరిజన కాంగ్రెస్‌ ఉమ్మడి జిల్లా శిక్షణా శిబిరం గురువారం ముగిసింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశావ్యాప్తంగా 25వేల మంది ఆదివాసీలు, గిరిజనులను మంచి నాయకులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతోనే ఈ శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న కార్యకర్తలకు సర్టిఫికెట్లు అందించారు. ట్రైకార్‌ చైర్మన్‌ తేజావత్‌ బెల్లయ్య నాయక్‌, జిల్లా ఆదివాసీ గిరిజన చైర్మన్‌ కెతావత్‌ యాదగిరి, రాణాప్రతాప్‌ రాథోడ్‌, ఐడీసీఎంఎస్‌ చైర్మన్‌ తారాచంద్‌, నాయకులు రాహుల్‌బాల, చంద్రు నాయక్‌, కెతావత్‌ ప్రకాష్‌ నాయక్‌, చాంగుబాయి, సురేష్‌ నాయక్‌, సుభాష్‌ జాదవ్‌ ఉన్నారు.

అందుబాటులో రైతులకు సరిపడ ఎరువుల నిల్వలు

- కలెక్టర్‌ వినయ్‌కృష్ణారెడ్డి
- మోపాల్‌లో గోదాం తనిఖీ



నిజామాబాద్‌ రూరల్‌: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లా రైతుల అవసరాలకు సరిపడా యూరియా, ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి తెలిపారు. మోపాల్‌ సహకార సంఘం ఎరువుల గోడౌన్‌ను కలెక్టర్‌ గురువారం తనిఖీ చేశారు. గిడ్డంగిలో రికార్డులలో పేర్కొన్న విధంగా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. ఎరువుల విక్రయాలను ఈ–పాస్‌ ద్వారా నిర్వహిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. స్టాక్‌ కొంత మిగిలి ఉన్నప్పుడే ఇండెంట్‌ సమర్పించి, ఎరువులను తెప్పించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కాగా, ఎరువుల నిల్వలతో కూడిన వివరాలను స్టాక్‌ బోర్డుపై తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువుల విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని కలెక్టర్‌ భరోసా కల్పించారు.

లంచం అడిగితే 1064 టోల్‌ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వండి



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైన లంచం అడిగితే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్‌ 1064కు సమాచారం ఇవ్వాలని ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్‌ గురువారం తెలిపారు. ఈమేరకు ప్రజలకు అవగాహన కల్పించడానికి కూడళ్లతోపాటు ఆర్టీసీ బస్సులు, ఆటోలకు ఏసీబీ టోల్‌ ఫ్రీ నంబర్‌ 1064కి సంబంధించిన స్టిక్కర్‌లను అతికించామన్నారు. ఎవరైనా ప్రభుత్వ కార్యాలయాలలో ఏదైన పని నిమిత్తం వెళితే, అధికారులు, సిబ్బంది పని పూర్తి చేయించడం కోసం లంచం డబ్బులు డిమాండ్‌ చేసినచో అవినీతి నిరోధక శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. లేదు నేరుగా టోల్‌ ఫ్రీ నంబర్‌కు గాని లేదా నిజామాబాద్‌ రేంజ్‌కి చెందిన అవినీతి నిరోధక శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్‌ ఆఫ్‌ పోలీస్‌కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

బడుల్లో ఆటస్థలాల విస్తీర్ణం ఎంత?

- జిల్లావ్యాప్తంగా లెక్కలు తీస్తున్న పాఠశాలల క్రీడా సమాఖ్య
- వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశం


మోర్తాడ్‌ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల వెనుక ఉన్న క్రీడా మైదానం

మోర్తాడ్‌(బాల్కొండ): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పరిధిలో ఉన్న క్రీడా మైదానాల విస్తీర్ణం ఎంతమేర ఉందో లెక్కించే పనిలో ఫిజికల్‌ డైరెక్టర్లు, పీఈటీలు నిమగ్నమయ్యారు. ఆట స్థలాల విస్తీర్ణంను లెక్కించి వాటి స్థితిగతులపై వివరాలు అందించాలని క్రీడా సమాఖ్య ఇటీవల ఆదేశాలు ఇవ్వడంతో జిల్లా వ్యాప్తంగా సిబ్బంది ఆ పనిలోపడ్డారు. చాలా చోట్ల పాఠశాలలకు ఉన్న మైదానాలలో అదనపు గదుల నిర్మాణం, అనువైన చోట షాపింగ్‌ కాంప్లెక్స్‌ల నిర్మాణం జరిగింది. ఫలితంగా విద్యార్థులకు ఆటల కోసం అనువైన స్థలం లేకుండాపోయింది. ఈక్రమంలో బడుల్లో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశ్యంతో క్రీడా మైదానాల విస్తీర్ణం లెక్కలు తీయాలని పాఠశాలల క్రీడా సమాఖ్య నిర్దేశించినట్లు తెలుస్తోంది. జిల్లాలో 255 ఉన్నత పాఠశాలలు ఉండగా 146 మంది వ్యాయామ ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. క్రీడా మైదానాల విస్తీర్ణం ఎంత, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌ ఇతరత్రా క్రీడల నిర్వహణకు అనువైన ఏర్పాట్లు ఉన్నాయా లేవా అనే వివరాలను గూగుల్‌ షీట్‌లలో వారు నమోదు చేస్తున్నారు. క్రీడా సమాఖ్యకు వివరాలను అందించిన తరువాత ప్రభుత్వం ఏదైనా సానుకూల నిర్ణయం తీసుకుంటుందని క్రీడాభిమానులు భావిస్తున్నారు.

సిబ్బందిని ఆదేశించాం..

పీడీలు,పీఈటీలు ఉన్న పాఠశాలల పరిధిలో క్రీడా మైదానాల వివరాలను నమోదు చేయాలని ఆదేశించాం. మాకు వివరాలను సేకరించాలని రాష్ట్ర క్రీడల సమాఖ్య నుంచి సూచనలు అందాయి. దీంతో క్షేత్ర స్థాయిలో వివరాలను నమోదు చేయాలని సిబ్బందికి వెల్లడించాం. – నాగమణి, ప్రధాన కార్యదర్శి జిల్లా పాఠశాలల క్రీడల సమాఖ్య

బ్రిడ్జి సైడ్‌వాల్‌ను ఢీకొట్టిన లారీ


హైవే బ్రిడ్జిపై సైడ్‌వాల్‌ను ఢీకొన్న లారీ


సర్వీస్‌ రోడ్డుపై పడిపోయిన కూలీలు

- ఎన్‌హెచ్‌ 161 పై ఘోర ప్రమాదం
- పైనుంచి సర్వీస్‌ రోడ్డుపై పడిన ఐదుగురు కూలీలు
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- ప్రమాదానికి స్టీరింగ్‌ వైఫల్యమే కారణం

పెద్దకొడప్‌గల్‌(జుక్కల్‌): కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్‌ మండల కేంద్రంలోని జాతీయ రహదారి 161 పై ఘోరరోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్టీరింగ్‌ వైఫల్యం కారణంగా లారీ హైవే బ్రిడ్జిపై సైడ్‌వాల్‌ను ఢీకొట్టడంతో క్యాబిన్‌లో కూర్చున్న ఐదుగురు కూలీలు పైనుంచి సర్వీస్‌ రోడ్డుపై పడిపోయారు. ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. గాయాలపాలైన ముగ్గురిని చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గురువారం పిట్లం మండలం నుంచి ఇటుక లోడ్‌ చేసుకొని మద్నూర్‌కు వెళ్లిన లారీ (ఏపీ 26 ఎక్స్‌ 1377) తిరిగి వస్తుండగా.. పెద్దకొడప్‌గల్‌లో నేషనల్‌ హైవే 161 బ్రిడ్జిపై స్టీరింగ్‌ ఫెయిలై సైడ్‌వాల్‌ను ఢీకొట్టింది. క్యాబిన్‌లో డ్రైవర్‌తోపాటు ఐదుగురు కూలీలు కూర్చున్నారు. లారీ సైడ్‌వాల్‌ను ఢీ కొట్టగానే డ్రైవర్‌ మినహా ఐదురు కూలీలు క్యాబిన్‌లో నుంచి కింద ఉన్న సర్వీస్‌రోడ్డుపై పడిపోయారు. పిట్లం మండలం రూం తండాకు చెందిన హలావత్‌ నర్సింగ్‌(30) అక్కడికక్కడే మృతి చెందాడు. మహారాష్ట్రకు చెందిన గణేశ్‌ పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్‌ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. మహారాష్ట్రకు చెందిన బింబాటో, రూం తండాకు చెందిన శోభన్‌, హలావత్‌ రమేశ్‌కు గాయాలుకాగా.. చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రం శివారులోని పాటి హన్మాన్‌ ఆలయ సమీపంలోగల వ్యవసాయ బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. బావిలోని నీటిలో మృతదేహం తేలియాడటంతో గురువారం ఉదయం గ్రామస్తులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి వయస్సు సుమారు 35 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, ఎత్తు ఐదున్నర అడుగులు ఉండి చామన చాయ రంగులో ఉన్నాడని ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. గోధుమ రంగు ప్యాంటు, నీలి రంగు చొక్కా ధరించి ఉన్నాడన్నారు. మృతుడి గురించి ఎవరికైన తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

క్రైం కార్నర్‌


ట్రాలీ ఆటో నుంచి పడి బాలుడు మృతి

మాక్లూర్‌: ట్రాలీ ఆటోలో ప్రయాణం చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి ఓ బాలుడు మృతిచెందాడు. మాక్లూర్‌ ఎస్సై రాజశేఖర్‌ తెలిపిన వివరాలు ఇలా.. నిజామాబాద్‌ నగరంలోని నెహ్రూనగర్‌ కాలనీకి చెందిన షేక్‌ ఇబ్రహీం తన సొంత ట్రాలీ ఆటోలో గురువారం భార్య ఫౌజియా సుల్తానా, నలుగురు బిడ్డలతో కలిసి ఆర్మూర్‌లోని బంధువుల ఇంటికి బయలుదేరారు. అడవి మామిడిపల్లి శివారులోని 63వ నంబర్‌ జాతీయ రహదారిపై అతడి కుమారుడు షేక్‌ అహ్మద్‌ (7) ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసుల పేరు చెప్పి వసూళ్లకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

బోధన్‌: పట్టణంలో పోలీసుల పేరు చెప్పి వసూళ్లకు పాల్పడిన ఓ వ్యక్తిని పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా.. పట్టణంలోని రెంజల్‌ బేస్‌ ప్రాంతానికి చెందిన మీనాజ్‌ అనే వ్యక్తి మట్కా నిర్వహిస్తుండేవాడు. అయితే ఈ విషయం పోలీసులకు తెలపకుండా ఉండటానికి మహ్మద్‌ అబ్దుల్‌ సోఫియాన్‌ అనే వ్యక్తి డబ్బులు డిమాండ్‌ చేశాడు. బాధితుడి నుంచి అతడు ప్రతినెలా రూ.5వేల నుంచి రూ.10వేల వరకు డబ్బులు వసూలు చేయగా, ఇప్పటి వరకు రూ. 2లక్షల వరకు వసూళ్లకు పాల్పడ్డాడు. గత రెండు నెలలుగా బాధితుడు డబ్బులు ఇవ్వకపోవడంతో నిందితుడు బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈమేరకు కేసు నమోదు చేసినట్లు బోధన్‌ టౌన్‌ సీఐ వెంకట నారాయణ తెలిపారు. నిందితుడు సోఫియాన్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో నెమలి మృతి




సిరికొండ: మండల కేంద్రానికి సమీపంలో గురువారం సాయంత్రం కుక్కల దాడిలో జాతీయ పక్షి నెమలి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. గ్రామ సమీపంలో మేత మేస్తున్న నెమలిపై కుక్కలు మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. స్థానికులు గమనించి కుక్కలను తరిమివేశారు. నెమలి వద్దకు వారు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందడంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. నెమలి కళేబరానికి పంచనామా నిర్వహించి ఖననం చేసినట్లు ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్వో రవీందర్‌, డీఆర్వో గంగారాం తెలిపారు.

ఆలయాల్లో చోరీ

బోధన్‌: ఎడపల్లి మండలం ఠాణాకలాన్‌ గ్రామంలోని పలు ఆలయాల్లో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని పెద్దమ్మ ఆలయంలో అమ్మవారి పుస్తె మట్టెలు, బంగారు నగలు చోరీ చేసి, మహాలక్ష్మి మందిరం, తుల్జాభవాని ఆలయం, శివాలయాల్లో హుండీలను దుండగులు పగులగొట్టి, నగదును ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. స్థానికుల సమాచారం మేరకు ఎడపల్లి ఎస్సై ముత్యాల రమా సిబ్బందితో కలిసి గురువారం ఆలయాలను పరిశీలించారు. గ్రామస్తులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్మూర్‌లో బోర్డు తిప్పేసిన తిరుమల ట్రేడర్స్‌

- రాయితీపై వస్తువులు ఇస్తామంటూ డబ్బులు వసూలు చేసిన నిర్వాహకులు
- మూడు రోజులుగా దుకాణం మూసిఉండటంతో బాధితుల ఆందోళన


తిరుమల ట్రేడర్స్‌ దుకాణం ఎదుట బాధితులు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని ఓ ట్రేడర్స్‌ దుకాణం బోర్డు తిప్పేసింది. రాయితీపై వస్తువులు అందిస్తామంటూ దుకాణం ఏర్పాటు చేయగా, కస్టమర్ల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసిన నిర్వాహకులు పరారయ్యారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని నిజాంసాగర్‌ కెనాల్‌ పక్కన గల ఎల్‌వీఆర్‌ కాంప్లెక్స్‌లో కొన్ని నెలల క్రితం తమిళనాడుకు చెందిన ఐదుగురు వ్యక్తులు తిరుమల ట్రేడర్స్‌ పేరుతో దుకాణం ఏర్పాటు చేశారు. ప్రతి వస్తువుపై 40శాతం రాయితీతో పంపిణీ చేస్తామని వారు ప్రచారం చేశారు. ఫోన్లు, సోఫా సెట్‌, ఫ్రిడ్జ్‌, కంప్యూటర్‌, వాషింగ్‌ మిషన్‌, డైనింగ్‌ టేబుల్‌, ఆల్‌ ఫర్నిచర్స్‌ ఎలక్ట్రానిక్‌ తదితర వస్తువుల కోసం ముందస్తుగా అడ్వాన్స్‌ ఇస్తే వారం రోజుల్లో వస్తువులు ఇస్తామని నమ్మబలికారు. దీంతో వందల మంది ఆర్డర్‌ ఇచ్చారు. మొదట్లో పలువురికి వస్తువులను 40శాతం రాయితీతో ఇవ్వడంతో నమ్మారు. దీంతో ఇటీవల మరింత మంది వస్తువుల కోసం రూ.లక్షల్లో డబ్బులు చెల్లించారు. కాగా వస్తువుల కోసం బాధితులు దుకాణం వద్దకు రాగా మంగళవారం నుంచి షాపు తెరవకపోవడంతోపాటు వారి ఫోన్లు స్విచ్‌ఆఫ్‌ రావడంతో ఆందోళనకు గురయ్యారు. సిరిగిరి శ్రీనివాస్‌ అనే బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్‌ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


శివరాజ్‌ కుమార్‌

డొంకేశ్వర్‌: రాష్ట్ర స్థాయి జావెలిన్‌ త్రో షాట్‌పుట్‌ పోటీలకు డొంకేశ్వర్‌ మండలం నూత్‌పల్లి గ్రామానికి చెందిన విద్యార్థి శివరాజ్‌ ఎంపికయ్యాడు. ఇటీవల జిల్లా కేంద్రంలోని నాగారంలో జిల్లాస్థాయి అథ్లెటిక్‌ పోటీలు జరిగాయి. ఇందులో శివరాజ్‌ కుమార్‌ ప్రతిభ చూపి గోల్డ్‌ మెడల్‌ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఆగస్టు 3 నుంచి హనుమకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో శివరాజ్‌ కుమార్‌ జిల్లా నుంచి పాల్గొననున్నారు. ప్రస్తుతం అతడు ఉప్పల్‌వాయి గురుకులంలో ఇంటర్‌ ఫస్టియర్‌ చదువుతున్నాడు.